క్లుప్తంగా

ఎంపీఓగా రామన్న



మద్దూరు: మండల పంచాయతీ అధికారిగా (ఎంపీఓ) రామన్న బుధవారం విధుల్లో చేరారు. ఇక్కడ ఎంపీఓగా విధులు నిర్వహిస్తున్న విజయలక్ష్మి బదిలీపై కృష్ణా మండలానికి వెళ్లింది. అక్కడ పనిచేస్తున్న ఎంపీఓ ఇక్కడికి బదిలీపై వచ్చినట్లు ఎంపీడీఓ జయరాములు తెలిపారు. నూతన ఎంపీఓ గ్రామాల్లో పారిశుద్ధ్య చర్యలు, హరితహారం తదితర కార్యక్రమాలపై దృష్టి సారిస్తానని పేర్కొన్నారు.

విద్యార్థులకు వైద్యపరీక్షలు



మాగనూర్: మండల కేంద్రంలోని బాలుర వసతి గృహంలోని విద్యార్థులకు పీహెచ్‌సీ డాక్టర్ నాగజ్యోతి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 60మందికి పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. జలుబు, దగ్గు, అలెర్జీ వంటి సమస్యలతో బాధపడుతున్న విద్యార్థులకు మందులు అందించి పలు సూచనలు ఇచ్చారు. విద్యార్థులు వానాకాలం దృష్టిలో ఉంచుకున్ని జాగ్రత్తలు పాటించాలని తెలిపారు. కార్యక్రమంలో హస్టల్ వార్డెన్ అఫ్జల్ అహ్మద్, ఏఎన్ఎం సుధారాణి, ఆశా కార్యకర్తలు కృష్ణవేణి, రేణుక, సరిత పాల్గొన్నారు.

ఆవు మృతి పరిహారం అందించిన విద్యుత్‌శాఖ



దామరగిద్ద: మండలంలోని కందెనపల్లిలో గతేడాది జూన్ నెలలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద వైర్లు తగిలి గ్రామానికి చెందిన గొల్ల భీంషప్ప ఆవు మృతిచెందగా విద్యుత్‌శాఖ ద్వారా మంజూరు చేసిన రూ. 40వేల నష్టపరిహారాన్ని బుధవారం రైతు భీంషప్పకు విద్యుత్ శాఖ జూనియర్ అసిస్టెంట్ మల్లేష్ అందజేశారు. ఈ మేరకు.. టీడీపీ ఉమ్మడి పార్లమెంటరీ కమిటీ ఉపాధ్యక్షుడు రాములు యాదవ్ రైతుకు నష్టపరిహారం ఇవ్వడంపై కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ మండల ఉపాధ్యక్షుడు వీరన్నగౌడ్, రైతులు పాల్గొన్నారు.

మద్యం తాగి వాహనాలు నడపొద్దు



మక్తల్: వాహనదారులు మద్యం తాగి వాహనాలు నడిపితే చర్యలు తీసుకుంటామని సీఐ చంద్రశేఖర్ అన్నారు. బుధవారం పట్టణంలోని నంబర్‌ప్లేట్ లేని వాహనాలను తనిఖీచేశారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ.. లైసెన్స్ లేకుండా వాహనాలు నడపొద్దని, అతి వేగంగా వాహనాలు నడపకుండా జాగ్రత్తగా పాటించాలని వాహనదారులకు సూచించారు. అంతకుముందు నంబర్ ప్లేట్‌లేని వాహనాలను సీజ్ చేశారు. ఆయనతోపాటు ఎస్ఐ భాగ్య లక్ష్మిరెడ్డి, పోలీసులు అశోక్‌కుమార్ తదితరులు ఉన్నారు.

శివాలయ అభివృద్ధికి ఆర్థిక సాయం



మరికల్: మండల కేంద్రంలోని శివాలయ అభివృద్ధికి బుచ్చప్ప బుధవారం ఆర్థిక సహాయం చేశారు. ఈ సాయాన్ని వీరశైవ లింగయత్ అధ్యక్షుడు జగదీష్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దాతలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి ఆర్థిక సాయం చేస్తే ఆయాన్ని అభివృద్ధి చేసేందుకు అవకాశం ఉందన్నారు. ఆర్థిక సాయం చేసిన బుచ్చప్పను వారు అభినందించారు. కార్యక్రమంలో శివకుమార్, అయ్యప్ప, వీరన్న పాల్గొన్నారు.

భూ సదస్సును జయప్రదం చేయండి

నారాయణపేట: స్థానిక ఎస్ఆర్ గార్డెన్‌లో గురువారం జరిగే భూ సదస్సులో భూమి సాగుచేస్తున్న పేదలు పాల్గొని విజయవంతం చేయాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బాలప్ప, గోపాల్ బుధవారం ఒక ప్రకటనలో కోరారు. ఈ సదస్సుకు ఎమ్మెల్యే డాక్టర్ చిట్టెం పర్ణికారెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకట్రాములు, కాంగ్రెస్ మాజీ జిల్లా అధ్యక్షుడు కుంభం శివకుమార్‌రెడ్డి, సీపీఎం జిల్లా కార్యదర్శి జి. వెంకటరామిరెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొనున్నారని తెలిపారు. ఈ సదస్సుకు జిల్లాలో ప్రభుత్వ భూములు సాగు చేసుకుంటున్న పేదలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

వాన దేవుడా.. కరుణించు

- వర్షం కోసం ఎదురుచూపులు
- పక్షం రోజులుగా పత్తాలేని వరుణుడు
- ఎండుతున్న పత్తి, జొన్న మొక్కలు
- నీళ్ల తడులతో కాపాడుకుంటున్న రైతులు



వర్షాలు లేకపోవడంతో పత్తి మొక్కలకు నీళ్లు పెడుతున్న రైతు

మరికల్: వరుణ దేవుడి కరుణ కోసం రైతన్న ఆకాశం వైపు ఆశగా ఎదురుచూస్తున్నాడు. విత్తనాలు నాటి 20 రోజులు గడుస్తున్నా మొలకెత్తకపోవడంతో రైతులు పొలాలను చూసి కన్నీళ్లు పెడుతున్నారు. నాటిన విత్తనాలను కాపాడుకోవడం కోసం నీటి వనరులు ఉన్న రైతులు స్ప్రింక్లర్ల సాయంతో నీటి తడులు వదులుతున్నారు. నీటి వనరులు లేని వారు ట్రాక్టర్ ట్యాంకర్ల సహాయంతో పొలాన్ని తడుపుతూ విత్తనాలు మొలకెత్తేలా ప్రయత్నం చేస్తున్నారు. సకాలంలో వర్షాలు కురవకపోవడంతో ఏ నలుగురు రైతులు కలిసిన వానల ముచ్చటే మాట్లాడుకోవడం కనిపిస్తోంది.

రోహిణి కార్తెతో సీజన్

రోహిణి కార్తెతో వానాకాలం సీజన్ ప్రారంభమైంది. ఈ కార్తెలో విత్తనాలు నాటితే అధిక దిగుబడి వస్తుందనే ఆశతో రైతులు విత్తనాలు వేయడం మొదలు పెట్టారు. అయితే ఆ కార్తెలో కురిసిన రెండు వర్షాలకు ముందుగా నాటిన రైతుల విత్తనాలు మొలకెత్తాయి. కానీ, ఆ తర్వాత గత 30 రోజులుగా వాన జాడ కానరావడం లేదు. వర్షాలు ఎప్పటిలాగే కురుస్తాయనే ఆశతో విత్తనాలు నాటిన రైతులు ఇప్పుడు ఆందోళనలో పడ్డారు. వర్షాలు లేని సమయంలో నాటిన విత్తనాలకు వరుణుడు కరుణించకపోవడంతో విత్తనాలు ఎండలకు పాడైపోతున్నాయి. జిల్లా వ్యాప్తంగా మేఘాలు కమ్ముకుంటున్న చినుకు రాలడం లేదు. గతేడాది కూడా ఇదే పరిస్థితులు దాపురించడంతో రైతులు ఎకరా వెంబడి రూ.30 వేలకుపైగా నష్టపోయారు. ప్రస్తుతం ఈ ఏడాది కూడా వానాకాలం ప్రారంభంలో వర్షాలు కురవకపోవడంతో పంటల సాగుకు రైతులు వెనకడుగు వేస్తున్నారు. మరోపక్క నారుమడులను సిద్ధం చేస్తున్న రైతులు మున్ముందు భారీ వర్షాలు కురిస్తే తప్ప పంటలు పండే అవకాశం కన్పించడం లేదు. ఇప్పటికే బోర్లలో భూ గర్భజలాలు ఇంకా పైకి రాలేదు. భారీ వర్షాలు పడితేనే వ్యవసాయ బోర్లలో నీటిమట్టం పెరిగే అవకాశం ఉందని రైతులు పేర్కొంటున్నారు.

బోరు నీళ్లు పెడుతున్న..



మూడు ఎకరాల్లో పత్తిసాగు చేశాను. మొదటి వర్షానికి విత్తనాలు మొలకెత్తాయి. కాని సకాలంలో వర్షాలు లేకపోవడంతో మొక్కలు ఎండిపోతున్నాయి. 20రోజుల నుంచి వర్షాల కోసం ఎదురు చూసిన పడలేదు. దీంతో చేసేది లేక బోరు నీళ్లను పారపెడుతు మొక్కలను కాపాడుకుంటున్నాను.

- నర్సింహులు, మరికల్

కన్నీళ్లే మిగిలాయి..



వర్షాలు లేక నాటిన విత్తనం మొలకెత్తకపోవడంతో పెట్టిన పెట్టుబడి కళ్ల ముందే ఆవిరి కావడంతో కన్నీళ్లు మిగిలాయి. వర్షాలు వస్తాయనే ఆశతో పది ఎకరాల్లో 20 రోజుల క్రితం పత్తి సాగు చేశాను. కాని ఇప్పటివరకు వానలు లేవు. వర్షాలు కురవకపోతే రూ. లక్షకు పైగా నష్టం వచ్చే ప్రమాదం ఉంది.

- రాములు, అప్పంపల్లి

చెడు అలవాట్లకు దూరంగా ఉండాలి



కోస్గిలో అవగాహన కల్పిస్తున్న ఎస్సై నరేష్



దామరగిద్దలో..

కోస్గి: మాదక ద్రవ్యాలను అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ చిత్తశుద్ధితో కృషి చేయాలని ఎస్సై–2 నరేష్ సూచించారు. ఈ మేరకు బుధవారం 'ఇంటర్‌నేషనల్ యాంటి డ్రగ్ 'డే' సందర్భంగా స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు అవగాహన నిర్వహించారు. ఎస్సై మాట్లాడుతూ.. నేటి సమాజంలో యువత డ్రగ్స్, ఇతర మత్తు పదార్థాలకు బానిసలై విలువైన తమ జీవితాలను నాశనం చేసుకుంటున్నారన్నారు. తల్లిదండ్రులు ఎన్నో ఆశలు పెట్టుకొని చదివిస్తున్నారనే విషయాన్ని ప్రతి విద్యార్థి గుర్తించుకొని తమ తల్లిదండ్రుల ఆశయాలను నేరవేర్చాలన్నారు. జీవితానికి ఓ లక్ష్యం ఏర్పరచుకొని చెడు మార్గాలకు దూరంగా ఉంటూ బాగా చదువుకొని లక్ష్య సాధనకోసం కృషి చేయాలన్నారు. అనంతరం విద్యార్థులకు యాంటి డ్రగ్స్ అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించి ప్రతిభ చూపిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది రామకృష్ణ, నర్సింహులు, కళాశాల అధ్యాపక బృందం పాల్గొన్నారు.

కళాశాల విద్యార్థుల ర్యాలీ..

మద్దూరు: డ్రగ్స్ వ్యతిరేక దినం సందర్భంగా మద్దూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు మండల కేంద్రంలో బుధవారం ర్యాలీ నిర్వహించారు. డ్రగ్స్ తీసుకోవడం వల్ల వచ్చే అనర్థాలను వివరిస్తూ.. వాటికి దూరంగా ఉండాలని నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ కళాశాల నుంచి పాతబస్టాండ్, పోలీస్ స్టేషన్, గ్రామ పంచాయతీ, కొత్తబస్టాండ్ మీదుగా కొనసాగింది. కార్యక్రమంలో కళాశాల ఉపన్యాసకులు రాములు, రాజేష్, లక్ష్మి, శ్రీనురెడ్డి, రమేష్, విజయ్‌కాంత్, శాంతునాయక్ తదితరులు పాల్గొన్నారు.

దామరగిద్ద: మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా ఎస్ఐ వసంత ఆధ్వర్యంలో జూనియర్ కళాశాల విద్యార్థులకు బుధవారం వ్యాసరచన పోటీలు నిర్వహించారు. స్థానిక కేజీబీవీ పాఠశాలలో విద్యార్థులు వ్యాసరచనలో పాల్గొన్నారు. ఈ ఏమరకు.. ఏఎస్ఐ అరుణ్ మాట్లాడుతూ.. డ్రగ్స్ నివారణకు ప్రతి ఒక్కరూ పాటుపడాలన్నా.. మత్తు పదార్థాలకు యువతరం బానిస కావడంతో భావితరాలకు ముప్పు వాటిల్లుతుందన్నారు. మత్తు పదార్థాలతో కలిగే అనర్థాలను వివరించారు. కానిస్టేబుల్స్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మరికల్: మండల పోలీస్ శాఖ ఆధ్వర్యంలో డ్రగ్స్‌ని వారణ కోసం విద్యార్థులకు అవగాహన పరీక్షలు నిర్వహించారు. బుధవారం మండలంలోని ఉన్నత పాఠశాల ఆవరణలో నిర్వహించిన పరీక్షలతో భవిష్యత్‌లో యువత డ్రగ్స్ బారిన పడకుండా ఉండేందుకు రాష్ట్ర పోలీస్‌శాఖ మేరకు అవగాహన నిర్వహిస్తున్నామని ఎస్ఐ మురళి తెలిపారు. ఈ పరీక్షలో ప్రతిభ చూపిన వారికి ప్రశంసా పత్రాలను అందజేస్తామన్నారు.



మద్దూరులో ..

గ్రామ అభివృద్ధికి పాటుపడుదాం..



గ్రామసభలో పాల్గొన్న అధికారులు

ఊట్కూరు: గ్రామ అభివృద్ధికి పాటుపడుదామని ప్రత్యేకాధికారి ఎంపీడీఓ ధనుంజయగౌడ్ కోరారు. బుధవారం గ్రామ పంచాయితీలో గ్రామసభ నిర్వహించారు. ఈ మేరకు.. తైబజార్, మటన్‌మార్కెట్ దుఖాణాల సముదాయం, వేలంపాటల గురించి చర్చించారు. ఈ సందర్భంగా ప్రత్యేకాధికారి ధనుంజయగౌడ్ మాట్లాడుతూ ఈ నెల 29న శనివారం తైబజార్, మటన్ మార్కెట్ దుఖాణాల సముదాయాలను వేలం వేయడం జరుగుతుందని గ్రామస్తులు వేలంపాటలో పాల్గొనవచ్చునని ఆయన కోరారు. గ్రామ పంచాయతీ ఆదాయం పెంచేందుకు ప్రతి ఒక్కరూ తమవంతు కృషి చేయాలని ఆయన కోరారు. గ్రామాన్ని అన్ని రంగాలలో అభివృద్ధిపరుద్దామని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి శ్రీనివాస్‌రావు, గ్రామస్తులు శ్రీనివాస్‌రావు, కోలప్ప, శేషప్ప, రాజప్ప, అనంత్‌రెడ్డి పాల్గొన్నారు.

రైతుకు భరోసా ఎప్పుడు..?



నారాయణపేట: వానాకాలం పంటసాగుకు ప్రభుత్వం ఇప్పటివరకు రైతు భరోసా ప్రకటించలేదని ఎప్పుడు ఇస్తుందో స్పష్టం చేయాలని మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు వెపూర్ రాములు డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడుతూ.. వానలు కురిసి రైతులు పంట సాగు చేస్తున్న ఇంతవరకు పంట పెట్టుబడికోసం ప్రభుత్వం రైతు భరోసాపై ఏలాంటి ప్రకటన చేయకపోవడం శోచనీయమన్నారు. కాంగ్రెస్ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రూ. 15వేల రైతు భరోసా అందించాలని, సబ్సిడీపై ఎరువులు, విత్తనాలు అందించాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా ఎన్నికల్లో ఇచ్చినహామీ మేరకు రైతు భరోసా, రుణ మాఫీ చేయాలని లేనిపక్షంలో ఆందోళన చేపడతామని హెచ్చరించారు. నాయకులు రవి నాయక్, మోహన్, బాల్‌రెడ్డి, నార్యానాయక్ పాల్గొన్నారు.

పండ్ల తోటల పెంపకంపై అవగాహన



అవగహన కల్పిస్తున్న ఇన్‌చార్జి ఏపీఓ

మాగనూర్: మండల పరిధిలోని అమ్మపల్లిలో ఇన్‌చార్జి ఏపీఓ హర్షవర్ధన్ ఆధ్వర్యంలో స్థానిక గ్రామ పంచాయతీలో గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుతం ఉపాధి హామీలో భాగంగా రైతులకు ఒక్క మంచి అవకాశం ఉందని పత్రి ఒక్కరూ పండ్లతోటల పెంపకం కోసం ముందుకు రావాలన్నారు. పండ్లతోటల పెంపకం ద్వారా రైతులు ఆర్థికంగా వృద్ధి చెందేందుకు ఉపయోగపడుతుందన్నారు. అదేవిధంగా గ్రామ అభివృద్ధిలో భాగంగా వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని తెలిపారు. ముఖ్యంగా ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకుని భూగర్బ జలాలను పెంచేందుకు కృషిచేయాలన్నారు. జాబ్‌కార్డు ఉన్న ప్రతి ఒక్కరూ సంబంధిత ఉపాధిహామీ సిబ్బందిని సంప్రదించి ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి రవి, గ్రామ ప్రత్యేక అధికారి వినయ్, సాంకేతిక సహాయకురాలు మహేశ్వరి, స్వామినాథ్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులతో అప్రమత్తం

ఆత్మకూర్: సీజనల్ వ్యాధులు ప్రబలకుండా మున్సిపాలిటీ ప్రత్యేకాధికారి చంద్రశేఖర్‌రాజు అన్నారు. బుధవారం కమిషనర్ నాగరాజుతో కలిసి వార్డుల్లో పర్యటించి స్థానిక గాంధీచౌక్‌లో మురుగు నీరు రోడ్డుపై ప్రవహిస్తు పారిశుద్యం లోపించడంతో అసహనం వ్యక్తం చేశారు. రోడ్డు విస్తరణలో భాగంగా షాపుల ఎదుట మెట్లను తొలగించినట్లు సంబంధిత షాపుల యజమాని కోర్టును ఆశ్రయించడంతో డ్రైయినేజీ నిర్మాణంలో జాప్యం జరిగిందన్నారు. అనంతరం స్థానిక మున్సిపాలిటీ కార్యాలయంలో వార్డుల అధికారులతో సమావేశమై పారిశుద్యం, తాగునీరు, దోమల నివారణ పై స్థానికులకు అవగాహన కల్పి ంచాలని వివరించారు.

బియ్యం ఇవ్వని మిల్లులు సీజ్‌చేస్తాం



రైస్‌మిల్లర్లతో మాట్లాడుతున్న తహసీల్దార్ రాజు

ఆత్మకూర్: రైస్ మిల్లర్లు వారం రోజుల్లోగా బియ్యం సీఎంఆర్‌కు అప్పజెప్పకుంటే రైస్‌మిల్లులను సీజ్ చేస్తామని తహసీల్దార్ రాజు స్పష్టం చేశారు. బుధవారం కలెక్టరు ఆదర్శ్ సురభి ఆదేశాల మేరకు స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో రైస్‌మిల్లుల యజమానులతో సమావేశం నిర్వహించారు. 2023–24 ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి మండలంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా ప్రభుత్వం సేకరించిన ధాన్యం మిల్లర్లకు అప్పగించినట్లు వివరించారు. ఆత్మకూర్‌లోని మిల్లర్లు 75 ఏసీకే సుమారు 21 వేల క్వింటాళ్ల బియ్యాన్ని సీఎంఆర్‌కు ఇవ్వాల్సి ఉందన్నారు. రెండేళ్లుగా రైసమిల్లర్లు బియ్యం సీఎంఆర్‌కు ఇవ్వకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. నిర్దేశించిన సమయంలోగా బియ్యం అప్పజెప్పకుంటే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో రైస్‌మిల్లర్ల అసోసియేషన్ జిల్లా గౌరవ అధ్యక్షుడు పులిమామిడి రమేష్‌శెట్టి, జిల్లా నాయకులు బిలకంటి గోవర్ధన్‌శెట్టి, కల్వ వెంకటేష్‌శెట్టి, సతీష్‌కుమార్, ఎస్ఎన్ బాబు తదితరులు ఉన్నారు.

బొగ్గు గనుల వేలం ఆపాలని నిరసన

మదనాపురం: బొగ్గు గనుల వేలాన్ని ఆపాలని ప్రభుత్వ రంగ సంస్థ సింగరేణికి అప్పగించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎండీ జబ్బార్ డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద సీపీఎం ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో 500 బొగ్గు గనులు ఉండగా.. ఇప్పటికే 300 బొగ్గు గనులను ప్రైవేటు, కార్పొరేట్ సంస్థలకు కారుచౌకగా కట్టబెట్టారని, ఇప్పుడు 67 బొగ్గు గనులను వేలం ద్వారా ప్రైవేటు శక్తులకు అప్పగించేందుకు సిద్ధమయ్యారని దుయ్యబట్టారు. దీన్ని వ్యతిరేకిస్తూ సీపీఎం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు నిరసన చేపడుతున్నామని పేర్కొన్నారు. వనపర్తి జిల్లా కేంద్రంలో జూన్ 28న జరిగే నిరసన కార్యక్రమాన్ని ప్రజలు జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

పంచాయతీల అభివృద్ధికి కృషిచేయాలి

కోయిల్‌కొండ: గ్రామపంచాయతీల అభివృద్ధే లక్ష్యంగా అధికారులు పనిచేయాలని ఎంపీడీఓ కాళప్ప సూచించారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో గ్రామపంచాయతీ అధికారులతో ఎన్ఆర్‌ఈజీఎస్, ప్రజాపాలన దరఖాస్తుల పరిశీలన, త్రాగునీటి సమస్య వంటి పలు సమస్యలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాలలో అడిగిన ప్రతికూలికి ఉపాధిహామీ పని కల్పించాలని ఆయన అన్నారు. అదేవిధంగా ప్రజాపాలన దరఖాస్తుల పరిశీలనను పూర్తిచేయాలన్నారుజీ. ఈ కార్యక్రమంలో ఎంపీఓ నజీర్‌హైమద్, వ్యవసాయాధికారి రాంపాల్, అర్‌డబ్ల్యూఎస్ ఏఈ గణేష్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల బంద్ ప్రశాంతం



మరికల్‌లో మాట్లాడుతున్న ఏబీవీపీ నాయకులు



ధన్వాడలో ..

మక్తల్: విద్యారంగంలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఏబీవీపీ ఆధ్వర్యంలో చేపట్టిన బంద్ ప్రశాంతంగా కొనసాగింది. ఈ మేరకు నాయకులు పట్టణంలోని ఏర్పాటుచేసిన నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ మేరకు. ఏబీవీపీ నగర కార్యదర్శి వంశీ మాట్లాడుతూ.. ప్రైవేట్ పాఠశాలలో అధిక మొత్తంలో ఫీజులు వసూలు చేస్తూ పేద వారికి విద్యను దూరం చేస్తున్నారన్నారు. అందుకు ఫీజుల నియంత్రణ చట్టం తీసుకురావాలన్నారు. ఏబీవీపీ నగర కార్యదర్శి వంశీ, వినయ్, నిఖిల్, నరేష్, నిహాల్, సందీప్, రాహుల్, శరణ్, అంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

మరికల్: ప్రభుత్వ పాఠశాలలో కనీస మౌళిక వసతులు కల్పించాలని బుధవారం ఏబీవీపీ చేపట్టిన బంద్ ప్రశాంతంగా ముగిసింది. ఈ సందర్భంగా ఏబీవీపీ నాయకులు నవీన్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలలో ఏళ్ల తరబడి తిష్టా వేసి సమస్యలతోపాటు ప్రైవేట్ పాఠశాలలో ఫీజుల నియంత్రణ చట్టం తీసుకురావాలన్నారు. నితీష్, మహేష్, హరికృష్ణ, రఘు తదితరులు పాల్గొన్నారు.

మాగనూర్: ఏబీవీపీ ఆధ్వర్యంలో చేపట్టిన విద్యాసంస్థల బంద్ బుధవారం విజయవంతమైందని ఏబీవీపీ నాయకులు సాయికుమార్ అన్నారు. ఆయన మాట్లాడుతూ.. ప్రైవేట్ కార్పరేట్ పాఠశాల యాజమాన్యాలు అధిక ఫీజులు వసూలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో పేద మధ్యతరగతి కుటుంబాలు ఎన్నో ఇబ్బందులకు గురవుతున్నాయన్నారు. నవీన్, నితిన్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

ధన్వాడ: విద్యను వ్యాపారంగా మార్చుతున్న ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని ఏబీవీపీ పట్టణ అధ్యక్షుడు రవికుమార్‌గౌడ్ డిమాండ్ చేశారు. ఏబీవీపీ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన పాఠశాలల బంద్ విజయవంతమైందన్నారు. ఈ మేరకు.. ఆయన మాట్లాడుతూ ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలు లక్షలకు లక్షల ఫీజులు దండుకుంటున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. బాలరాజ్, నవీన్, అజయ్ పాల్గొన్నారు.

దామరగిద్ద: విద్యారంగ సమస్యల పరిష్కారంలో భాగంగా మండల కేంద్రంతోపాటు వివిధ గ్రామాల్లో ఏబీవీపీ కాక్యకర్తలు ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల మధ్యాహ్నం తరగతులను బహిష్కరించారు. కార్యక్రమంలో ఏబీవీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.



మాగనూర్‌లో..

కనీస వేతనం రూ. 26వేలు ఇవ్వాలని వినతి



మున్సిపల్ కమిషనర్ సునితకు వినతిపత్రాన్ని అందజేస్తున్న కార్మికులు

నారాయణపేట: మున్సిపల్ కాంట్రాక్ట్ అవుట్ సోర్సింగ్ ఉద్యోగ కార్మికులకు ప్రభుత్వం త్వరలో ప్రకటించబోయే నూతన పీఆర్‌సీలో కనీస వేతనం రూ. 26 వేలు నిర్ణయించి ఇవ్వాలని కోరుతూ బుధవారం మున్సిపల్ కమిషనర్ సునీతకు మున్సిపల్ కార్మికులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకుపోవాలని తెలంగాణ మున్సిపల్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా నాయకులు జె.హన్మంతు, కే. సాయిలు కోరారు. సీఆర్‌సీ వేసేలోపు ఆంధ్రప్రదేశ్ మాదిరిగా కనీస వేతనం రూ. 21 వేలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ ఉద్యోగ కార్మికులు నారాయణ, గణే ష్, దయానంద్, రాజు, బుగ్గప్ప పాల్గొన్నారు.

పంటల సాగు వివరాల నమోదు



పంటలను నమోదు చేస్తున్న ఏఈఓ

కోస్గి: రైతులు సాగుచేసిన పంటల సాగును క్షేత్రస్థాయిలో పరిశీలించి నమోదు చేస్తున్నామని, రైతులు వ్యవసాయ శాఖ అధికారులకు తమ పంటల వివరాలు అందజేయాలని ఏఈఓ తిరుపతయ్య సూచించారు. ఈ మేరకు బుధవారం మండల పరిధిలోని చెన్నారంలో రైతుల పొలాల్ని పరిశీలించి వానాకాలంలో సాగు చేసిన జొన్నపంట వివరాలను నమోదు చేసుకున్నారు. ప్రభుత్వం వ్యవసాయ శాఖ అధికారులు నిర్వహించే పంటల సాగు వివరాలను ప్రామాణికంగా తీసుకుంటుందని, రైతులు విధిగా తమ పంటలను నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పలువురు రైతులు తదితరులు పాల్గొన్నారు.

వీఓఏలకు కనీస వేతనం అందజేయాలి



మద్దూర్‌లో వినతిపత్రం అందిస్తున్న వీఓఏలు



ఊట్కూరులో ఏపీఎంకు వినతిపత్రం అందిస్తున్న వీఓఏలు

ఊట్కూరు: గ్రేడింగ్‌కు సంబంధం లేకుండా వేతనాలు చెల్లించాలని బుధవారం వీఓఏల సంఘం ఆధ్వర్యంలో ఏపీఎం నిర్మలకు వినతిపత్రం అందజేశారు. ఈ మేరకు.. ఐకేపీ ఉద్యోగుల సంఘం మండల అధ్యక్షుడు కతలప్ప మాట్లాడుతూ.. కనీస వేతనం రూ. 26 వేలకు పెంచాలని డ్రెస్‌కోడ్, గుర్తింపు కార్డులు, సాధారణ బీమా తదితర సౌకర్యాలు కలిపించాలని వారు డిమాండ్ చేశారు. అలాగే ప్రతి వీఓఏలకు ట్యాబ్‌లు అందించాలని కోరారు. కార్యదర్శి వెంకటేశ్వరమ్మ, సుజాత, యూసూఫ్, వెంకట్‌రెడ్డి, ఇలియాస్ తదితరులు పాల్గొన్నారు.

మద్దూరు: వీఓఏలకు కనీస వేతనం అమలు చేయాలని, దీంతో పాటు ప్రమాద బీమా, ఐడీ కార్డులు కల్పించాలని జిల్లా వీఓఏల సంఘం కార్యదర్శి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. స్థానిక ఐకేపీ ఏపీఎం నారాయణకు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని మండల వీఓలు అందజేశారు. ఈ మేరకు.. వారు మాట్లాడుతూ.. ప్రభుత్వం మమల్ని గుర్తించి గ్రేడింగ్‌కు సంబంధం లేకుండా మే 2024 నెలకు సంబంధించిన వేతనం విడుదల చేయాలని కోరారు. కార్యక్రమంలో మండల వీఓఏలు పురుషోత్తం, వెంకట్‌రాములు, బాలు, హన్మంతు పాల్గొన్నారు.

మరమ్మతుకు నోచుకోని సెంట్రల్ లైటింగ్

మరికల్: మండల కేంద్రంలోని జాతీయ రహదారిపై ఏర్పాటు చేసిన సెంట్రల్ లైట్లు మరమ్మతులకు నోచుకోవడం లేదు. రెండేళ్ల క్రితం మండలంలోని 167 జాతీయ రహదారిపై సెంట్రల్ లైటింగ్‌ను ప్రారంభించారు. ఇందులో గుర్తు తెలియని వాహనం ఢీకొని ఒక స్తంభం విరిగిపాయింది. వీటిని మరమ్మతులు చేయాలని అధికారులను కోరిన ఎవరు పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.